# నందనవనం - 3

ఆ మరునాడు ఉదయమే,

ఇంటిలోపలనుండి బయటకు వచ్చిన ఆయన తడికె తలుపు తీసుకుని వస్తున్నతనిని చూసి ... ‘‘సూర్యం ... వచ్చావా...?’’ అన్నాడు.

సూర్యం తనని పట్టి పట్టి చూస్తున్నట్లనిపించటంతో ‘‘ఏంటయ్యా.. అలా చూస్తున్నావ్....?’’ చనువుగా అడిగాడు.

‘‘అంటే... ఏం లేదండీ.. ఒక మాటనే రకరకాల ఉద్దేశాలతో పలకవచ్చును కదా....మీరు.. అప్పుడే దిగబడ్డావా అనే అభిప్రాయంతో గానీ అన్నారేమోనని అనుమానం వచ్చి... కొంచెం ఆరాగా పరిశీలించా..!’’.

ఆయన పెద్దగా నవ్వేసాడు ‘‘భలేవాడివయ్యా....’’ అంటూ. ‘‘సరే...సరే... నీ పరిశీలనతో నువ్వు తెలుసుకున్నదేమిటో చెప్పు చూద్దాం....!’’ అన్నాడు మళ్ళీ.

‘‘ఆదరంగానే అన్నారనిపించింది. లేకపోతే... వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోతూ, ‘ఏదో పనిమీద ఇటు వెళ్తూ... మిమ్మల్ని చూసి ఒక క్షణం ఆగానండీ..’ అని చెబుదామనుకున్నా....’’

ఆ మాటలకు ఆయన మళ్ళీ పెద్దగా నవ్వాడు. ‘‘మరీ ఇంత నిజాయితీగా మనసులో మాటను చెప్పేసే వ్యక్తివని అనుకోలేదు సుమా...!’’

‘‘నేను కూడా... అందరికీ చెప్పనేమో... మీ ముందు నిలబడి మనసులో మాటను కాకుండా వేరేగా చెప్పటం నాకూ కుదరని పని అని ఇపుడే అర్థమైందండీ!’’

ఒక క్షణం విభ్రాంతిగా అతని వైపు చూసి మీ అమ్మగారన్న మాటలు నిజమేననిపిస్తున్నాయి! నిన్న నీ గురించి చెబుతూ.. ‘హనుమంతుడిని మొదటిసారి చూసిన శ్రీరాముడికి ఏదో ఆప్యాయత వెతుక్కుంటూ

వచ్చిందన్న అనుభూతి కలిగినట్లుగా... నిన్ను కలిసినపుడు అలాగే ఏదో అపురూపమైన అనుభూతి కలిగిందట!' ఇక్కడ శ్రీరాముడి పోలికకు ఎవరూ లేకపోయినా... నువ్వు మాత్రం నిజంగా హనుమంతుడి లాంటి వ్యక్తివే..! నేను ఈ మాట మనస్ఫూర్తిగానే చెబుతున్నాను మరి!''

సూర్యం మొహం ఆనందంతో వికసించింది !

''మీకూ తెలిసే ఉంటుంది... 'రాముడిలాంటి రాజు ఉంటే, హనుమంతండిలాంటి బంటూ ఉంటాడనే' సామెత ఉంది కదండీ ! మొత్తానికి ఏమయితేనేం గానీ ... నేను నిజంగానే ఆంజనేయుడికి వీరభక్తుడినండి! నేనిప్పుడు స్నానం చేసి బయలుదేరి వస్తోంటే మా నాన్న 'గుడికేనా' అనడిగితే ముందు అయ్యవారింటికి వెళ్ళొస్తానని చెప్పానా.. దీనికి మా నాన్న 'అయితే ఇక గుడికెందుకులే' అన్నాడండీ..!''

''అవునా...!'' అంటూ ఆశ్చర్యంగా చూసి ఎందుకలా అన్నారంటావ్...?'' అనడిగాడాయన.

"మొదట నాకూ కొంచెం ఆశ్చర్యంగా అనిపించినా, ఒక క్షణం ఆలోచిస్తే మా నాన్న అన్న మాటల్లో అర్థం బోధపడిరది! గుడికి వెళ్ళి దేముడికి దండం ఎందుకు పెడతాం... శక్తివంతుడైన ఆ భగవంతుడు మనకు భరోసానిస్తూ రక్షణగా ఉంటాడనీ, ఆపైన గుడిలో కాసేపు కూర్చుంటే, పవిత్రభావనతో మనసు ప్రశాంతంగా మారి ఆనందమయం అవుతుందనే నమ్మకంతోనే కదండీ...?''

ఆశ్చర్యంగా అతని మాటలు వింటోన్న ఆయనవైపు చిరునవ్వుతో చూసిన సూర్యం మళ్ళీ మొదలు పెట్టాడు ''అలాగే, మంచి మనసున్న వ్యక్తుల్ని కలిసినా, కాసేపు మాట్లాడినా అదే ఫలితం కలుగుతుంది..!. నా మాటలు కరెక్టే కదండీ..?''

''కరెక్టే కావచ్చును గానీ ఒక సందేహం... మనం కలిసిందే నిన్న. మాట్లాడుకున్నదే కాసేపు మరి ... మంచి భావాలున్న లేక మంచితనం నిండిన మనుష్యులమనే అభిప్రాయానికి వచ్చేయటం తొందరపాటు కాదూ?''

సూర్యం ''కాదండి..'' అంటూ తలవూపాడు. ''మీరూ కాసేపటిలోనే కదా నా గురించి మాటకారినంటూ ఓ అభిప్రాయం వెలిబుచ్చారు, అది తొందరపాటని అనలేరు కదండీ...!''

''అంతే... అలాగే నీకూ మా గురించి మంచి అభిప్రాయం ఏర్పడిరదంటావ్..?''

''సరిగ్గా చెప్పారు. మీరు ఇక్కడ ఉండటానికి వచ్చామని చెప్పగానే, మా ఊరుకు మంచి చేయటానికి వచ్చిన మహానుభావుడిలా అనిపించారు! నిజమండీ!'' అని అటూ ఇటూ చూసి ''అబ్బాయిగారు, అమ్మగారూ కనిపించరేం..?'' అనడిగాడు సూర్యం.

''మా వాడు పొద్దు పొడవక ముందే ఏదో పనుందంటూ హడావుడిగా వెళ్ళిపోతున్నాడు. వాకింగుకో, మరి... ఏ అమ్మాయితోనైనా డేటింగో... నేను వివరం అడగలేదు. అలాంటి వివరాలేవైనా వాళ్ళమ్మకే చెబుతాడు !''

సూర్యం ఆ మాటలకు చిన్నగా నవ్వి ''మరి... అమ్మగారూ కనుపించటం లేదేమండి...? అనడిగాడు.

''ఈ సమయంలో నాలా ఖాళీగా ఉంటారా..? వంటగదిలో హడావుడి పడుతూంటుంది. లోపలికి వెళ్దాం.. రా...'' అంటూ ఆయన సూర్యాన్ని లోపలకు చేయి పట్టుకుని తీసుకువెళ్ళాడు. అక్కడ పరిచి ఉన్న చిన్న చాప మీద కూర్చుని, సూర్యాన్నీ కూర్చోబెట్టుకుని, అక్కడున్న ప్లేటును తిరగేసి చేత్తో దరువు వేస్తూ శబ్దం చేసేసరికి లోపల నుండి శ్రీ వల్లి వచ్చింది. సూర్యాన్ని చూసి చిరునవ్వు నవ్వి లోపలకు వెళ్ళిపోయింది.

''నమస్కారమండీ...!'' అని సూర్యం రెండు చేతులూ జోడిరచి చెప్పినా ఆవిడ చిరునవ్వుతో చూసిందేగానీ పలుకరించలేదు.

ఆయన అప్పుడు అసలు విషయం వివరించాడు. ''ఈ రోజు మా ఇంటి ఇలవేలుపు శ్రీవల్లీ అమ్మగారి కి మౌనవ్రతం ! వారానికి ఓ రోజు మాత్రమేలే, ఈ రోజంతా మేం ఆమెగారి మూకాభినయం చూసి ఆనందిస్తాం! కాసేపు నీకూ ఆ అవకాశం దక్కిందన్న మాట!''

శ్రీవల్లి రెండు ప్లేటులో వేడివేడి ఇడ్లీలు, చట్నీ వడ్డించింది.

సూర్యం ఏదో చెప్పబోతోంటే... ఆయన చేయి చాపి ''కాదనటానికేం వీల్లేదు. బాగా లేకపోతే మాత్రం తినలేకపోతున్నానని చెప్పు... నేనర్థం చేసుకుంటాను! మారు వడ్డించుకోకపోతే ఆవిడకూ అర్ధమౌతుంది!'' అన్నాడు.

సూర్యం దాంతో ఇంకేమనకుండా ప్లేటులో చేయి పెట్టాడు.

ఆవిడ ప్లేటులో మరి రెండు వడ్డించేసరికి బాగా లేవని అర్థంచేసుకుంటారేమోననే అనుమానంతో చేయి అడ్డం పెట్టకుండా వూరుకున్నాడు.

''నీ మొహమాటానికి ఇదే శిక్ష. కానీయ్ మరి...'' అన్నాడాయన చిన్నగా నవ్వుతూ. ''బావున్నాయని చెప్పే పద్ధతి ఇదేనని మీరే చెప్పారు కదండీ!''

''అయితే నిజంగానే బావున్నాయని నీ అభిప్రాయమా..?'' ఆయన ఆశ్చర్యాన్ని అభినయించాడు.

సూర్యం కూడా చిరునవ్వుతో జవాబు చెప్పాడు ''నేను ఇష్టంగా తినటాన్ని గమనించే ఇలా అడుగుతున్నారేం..? నిజం చెప్పాలంటే... ఇడ్లీలు ఇలా ఇంత రుచిగా ఉంటాయని నాకు అర్థమైందీరోజే నండీ !"

శ్రీవల్లి మొహం వెలిగింది.

'విన్నారుగా' అన్నట్లు చూసిందాయనవైపు.

''నీకో మాట చెప్పనా..?'' అంటూ ఆయన సూర్యం చెవి దగ్గరగా వంగి మెల్లని స్వరంతో చెప్పాడు ''మొదటే ప్లేటులో చాలా తక్కువగా పెడితే, మారు అడగటం తప్పనిసరి అవుతుంది, అప్పుడు నీకూ ఆనందంగా ఉంటుందికదాని ఆవిడకు చెప్పాను చాలాసార్లే. అయినా ఆవిడ నా మాటల్ని ఖాతరు చేయదు. నేనూ ఆమెకు ఆనందం కలిగించటానికి మారు అడగాల్సిన పని కల్పించుకోను!'' సరదాగా నవ్వాడు కూడా.

సూర్యం కూడా నవ్వేసాడు. ''రోజూ ఇలా తినాలంటే కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది. నాకు చద్దన్నం తినే అలవాటు ఉందిలెండి, తిననంటే మా అమ్మ వూరుకోదు, ఇలా ఇక్కడా తింటున్నానంటే నమ్మదు కూడా. అలాగని ఇంటికి వెళ్ళి మళ్ళీ ఆ చద్దన్నం తినాలంటే కష్టం కదండీ...?''

ఆయన సూర్యం వైపు కొంచెం నిష్ఠూరంగా చూస్తూ అన్నాడు. ''మరి... ఎందుకు నాతో అలా అబద్ధం చెప్పావ్ ?''

సూర్యం అయోమయంగా చూసి 'ఏం చెప్పాను' అన్నట్లుగా ఆలోచిస్తుంటే, ఆయనే మళ్ళీ చిరునవ్వుతో అన్నాడు. ''మంచి మనుష్యులు ఉండే ఇల్లే దేవాలయం లాంటిదని నువ్వు అనుకుంటున్నట్లుగా చెప్పావు కదా! గుడిలో కూర్చుని రవ్వంత ప్రసాదాన్ని నోట్లో వేసుకున్నట్లుగా, ఇక్కడేదో తిని ఇంటికి వెళ్ళి మీ అమ్మ చేతి చద్దన్నం సుష్టుగా తిను. ఎలాగూ మీ నాన్నకి సాయంగా మీ పొలానికి వెళ్తావుగా, శుభ్రంగా ఎంత తిన్నా అరిగిపోయి, మధ్యాన్నానికి కరకరలాడే ఆకలి వేస్తుంది. కష్టపడే వాళ్ళకి భగవంతుడు ఇచ్చిన వరం అది. మా ఇంటికి వచ్చిన హనుమంతుడి భక్తుడికి ప్రేమగా ఇంత నైవేద్యం పెట్టగలిగిన ఆనందం మాకూ దక్కుతుంది! ఏమంటావ్... నామాట నచ్చిందా...?''

''బావుంది కానీ... నాదీ ఒక మాట చెప్పమంటారా? నిజానికి ఈ ఊళ్లో ఉండే కొద్ది రోజుల్లోనే నేను గుడికి వెళ్తుంటాను. అలాగే... అపుడపుడూ అమ్మగారి చేతి వంట అడిగి మరీ తింటుంటా. ఇడ్లీ చేసేటప్పుడు ముందుగానే అనుకుంటారుగా, చెబితే ఆ రోజుల్లో వచ్చి తప్పని సరిగా టిఫిన్ చేస్తానండీ!''

ఆ మాటలకు ఆయన పకపక నవ్వాడు.

''నాకు ఇష్టమైన టిఫిను ఇదే... మావాడికి గిట్టదు గానీ... అందుకే ఏదో వంకతో తప్పించుకు పోతుంటాడు. నీ కోరిక ప్రకారం అయితే... నువ్వు ఎక్కువసార్లు తినాల్సి ఉంటుంది, నాకోసం ఆవిడగారు తరుచూ చేసే తేలికైన ఉపాహారం ఇదేమరి! అపుడపుడూ మాత్రం మార్చి చేస్తూంటుంది

వాళ్ళ అబ్బాయి కోసం! నిన్ను చిన్న కొడుకుగా అంగీకరించింది కాబట్టి... ఇక ఇష్టంగా ఇదే టిఫిను ఎక్కువగా చేస్తుంటుందేమో! ఫరవాలేదా, నాకేం ఇబ్బందికాదు, బాగా ఆలోచించుకో...!''

వేళాకోళంగా ఆయన అన్న ఆ మాటలకు సూర్యం కూడా నవ్వుతూ ''నాకేం ఫర్వాలేదండీ! చాలా సంతోషం కూడాను, టిఫిను తినటంలోనే కాదు, తయారు చేసే పనిలో కూడా సాయం చేయగలిగితే ఇంకా నాకు చాలా తృప్తిగా ఉంటుంది!'' అన్నాడు.

ఆయన నిట్టూర్చాడు, ''వండి వడ్డించటం ఆమెకి బాగా ఇష్టమైన పని. అందులో ఎవరూ వేలు పెట్టటానికి అంగీకరించదు, నేనెన్నో సార్లు ప్రయత్నం చేసీ, ఓడిపోయాను. అయితే మా వాడు చేయాల్సిన పనుల్లో మాత్రం నీకూ వాటా నేనివ్వగలను!''

వెంటనే సూర్యం ''ఎందుకంటే... మరి... నేను చిన్న కొడుకును కదండీ...!'' అనగానే ఇద్దరూ ఫక్కుమని నవ్వుకున్నారు.

అక్కడే ఉన్న శ్రీవల్లి కూడా సూర్యం వైపు చిరునవ్వుతో చూసింది.

'మనసులో మాట చెప్పటానికి పెదవుల అవసరం లేకుండా ముఖకవళికలతో కూడా ఇంత బాగా చెప్పవచ్చునా' అనుకున్నాడు సూర్యం మనసులోనే.

సూర్యం ఒక నిముషం మౌనంగా ఉండి తర్వాత ఆయనను నెమ్మదిగా అడిగాడు.

''మౌనవ్రతం చేయటం వలన లాభం ఏమిటండీ...?''.

ఆయన ఉత్సాహంగా వివరించాడు ''మనసు నిర్మలంగా మారుతుందట కొత్త ఉత్తేజమూ కలగుతుంది! ఆ పైన 'మౌనేన కలహం నాస్తి' అన్నారుగా, అంటే... మాటలే లేకుంటే పోట్లాటలు ఏం వస్తాయి.? ప్రశాంతం గానూ రోజు గడుస్తుంది! ఇంకా ఏమైనా ఉన్నాయేమో నాకు తెలియదుగానీ, ఇవి చాలవా...?''

సూర్యం చిరునవ్వుతో మరో ప్రశ్న వేసాడు.

‘‘అయితే మీరు కూడా వారానికో రోజు చేస్తారా..? నేను కూడా చేస్తే బావుంటుందేమో ననే ఆలోచనా వస్తోంది. చేయనాండీ...?’’

ఆయన క్షణం కూడా ఆలశ్యం చేయకుండా వెంటనే సమాధానం చెప్పేశాడు.

‘‘నీకింకా పెళ్ళి కాలేదుగా, నువ్వు చేయాల్సిన అవసరమేమీ లేదు! ఇక నా సంగతి చెప్పమంటావా... ఆవిడ మౌనవ్రతం అంటూ ప్రకటించి అధికారికంగా చేస్తుందిగానీ, నేను స్వేచ్ఛగా ఈ ఒక్కరోజు మాత్రమే, నా ఇష్టానుసారం మాట్లాడగలను! మిగతా రోజులన్నీ అనధికారంగా మౌనవ్రతం చేయాల్సివస్తుంది! మహా అయితే... ‘అవును... సరే...’ అనే రెండు మాటలే నానోటి నుండి వస్తాయి. అంటే... మిగతా రోజులన్నీ నేనూ మౌనవ్రతం చేస్తున్నట్లే లెక్క కదా...?’’

తమాషాగా ఆయన చెప్పిన మాటలకు సూర్యం సరదాగా నవ్వాడు.

శ్రీవల్లి మాత్రం కొంచెం చురచుర చూసి లోపలకు వెళ్ళింది.

ఆయన సూర్యంకు కొంచెం దగ్గరగా జరిగి ‘‘నీకు ఇంకో మాటా చెప్పాలి’’ అంటూ మళ్ళీ అన్నాడు. ‘‘వారం అంతా ఆవిడ మాకు ఏవో ప్రవచనాలూ, సూక్తులూ, సామెతలూ లాంటివి చెబుతూనే ఉంటుంది! అందుకే పాపం... ఒకరోజు అయినా నోటికి విశ్రాంతి నివ్వటం అవసరమేమో అనిపిస్తుంది! ఇంకో మాటా చెబుతా, ఆవిడ గొప్పతనం ఏమిటంటే... మా మాటల్లోగానీ, చేతల్లోగానీ.... వగరూ, పొగరూ పెరుగుతున్నాయనిపిస్తే.... చూపులతోనే కత్తెర వేసేస్తుంది! మా మాటల్లో మృదుత్వం, నడవడిలో మర్యాద, మన్ననా కనుపిస్తున్నాయంటే... దానికి ఆవిడే ప్రధాన కారణం ! కట్టు కున్నవాడినీ, కన్నవాడినీ కూడా ఒకేవిధంగా కట్టుబాట్లలో నడిపిస్తోంది!’’ అన్నాడు.

‘‘ఇదంతా ఏమో నాకు సరిగా తెలియదుగానీ, అమ్మగారు మాట్లాడకపోయినా పెదవుల విరుపులో, కనుల మెరుపులతో, కనుబొమల కదలికలతో ఏ భావాన్నయినా ఎంత బాగా చెప్పగలరూ అనిపిస్తోందండీ! కొందరు కంఠస్వరం అవసరం లేకుండానే చాకచక్యంగా మాట్లాడగలరనే విషయం నాకీరోజే తెలిసింది!’’ అన్నాడు సూర్యం.

ఇంతలోనే శ్రీవల్లి రెండు గాజు గ్లాసులతో మజ్జిగ తీసుకువచ్చి ఇద్దరికీ అందించింది. ఖాళీ గ్లాసును అక్కడ పెడుతూ శ్రీవల్లికి రెండు చేతులూ జోడిరచి నమస్కరించాడు.

‘‘అమ్మా... మీరిలా నాకు తిండి పెట్టటం మాత్రమే కాదు, మీ కుటుంబంలోని వ్యక్తిగా నాకూ బంధుత్వం కలిగించారు కాబట్టి... నన్ను దారిలో పెట్టే బాధ్యత కూడా మీదే!’’ అన్నాడు చిరునవ్వుతో.

‘‘అంటే... ఏమిటీ... అపుడపుడూ కొంచెం గడ్డి కూడా పెడుతూ

ఉండాలంటావ్... అంతేగా?’’ పెద్దగా నవ్వాడాయన.

మిగతా ఇద్దరూ కూడా చిరునవ్వులు చిందించారు.

సూర్యం ఆయనతోపాటుగా బయటకు వచ్చి, అక్కడ ఓ అరుగు వారన ఉంచిన రేకుషీటును చూపించాడు. ‘‘ఎవరైనా కొత్తగా ఈ ఊరుకు వచ్చినప్పుడు ఏ దారి నుండి వెళ్ళాలా అనే సందేహం రాకుండా తయారు చేసానండీ. ఊరుకి మా పొలం మొదట్లోనే ఉంటుంది కాబట్టి అక్కడ దీనిని నిలపాలి” అని చెప్పాడు. ఆయన దానిని చేతిలోకి తీసుకుని పరిశీలనగా చూశాడు.

రేకుషీటుపై పెయింటింగ్ వేసిన రంగుపై ‘శ్రీపురానికి దారి’ అని రాసిన గుండ్రని అక్షరాలు ఇంకో రంగులో ఉన్నాయి. ఆ అక్షరాల పక్కనే వేలు చాపి చూపిస్తున్న చేయి బొమ్మ కూడా ఉంది. చూసీ చూడగానే ‘మంచి ప్రయత్నం చేశావు’ అంటూ ఆప్యాయంగా సూర్యం భుజం తట్టాడాయన. తర్వాత ఆ అక్షరాలపైన ఉన్న ఖాళీని వ్రేళ్ళతో కొలిచి చూసి ‘సరిపోతుంది’ అని లోలోపల అనుకుంటున్నట్లుగా కొంచెంగా పైకే అనటంతో సూర్యం వెంటనే అడిగాడు ‘‘దేనికి సరిపోతుంది అంటున్నారూ..?’’ అని.

ఆయన చిన్నగా నవ్వేసి “నా మనసులో ఓ ఊహ ఉంది. అది దీని పైన రాయటానికి ఖాళీ సరిపోతుందా అని అనుకుంటున్నాలే. అంతే. అయితే ఏమిటదని మాత్రం ఇప్పుడే అడక్కు. నేననుకున్నది పూర్తిగా

జరిగాక ముందుగా నీకే చెబుతాను. సరేనా...?'' అని వెంటనే ఇంకో మాట చెప్పాడు.

''చేయాల్సిన పనుల్లో నీకూ మా వాడిగా వాటా ఇస్తానని ఇందాకనే చెప్పాకదా.. ఇపుడీ షీటు చూడగానే గుర్తొచ్చింది. మా తాతగారు అరుగుల బడి నడిపేవారిని విన్నావు కదా... ఈ సింహద్వారానికి పక్కగా చక్కని కొటేషన్సు రాసి ఉంచేవాళ్ళట. ఆయన తరుచుగా చెప్పే ఓ మాటని మా నాన్న చెప్పారు. 'ఆనందమే జీవిత పరమావధి... పరోపకారమే వ్రతవిధీ' అని. దానినే ఓ చెక్కపై రాయించి అరుగుపైన గోడకి వ్రేలాడేట్లుగా ఏర్పాటు చేద్దామా అనే ఆలోచన ఉంది. నువ్విది చూపించగానే నాకది గుర్తుకు వచ్చింది.''

సూర్యం ఆనందంగా తలవూపి ''తప్పకుండా రెండు రోజుల్లోనే చేసి తీసుకువచ్చి మీకు చూపిస్తానండి'' అన్నాడు.

రెండు రోజుల తర్వాత వచ్చిన సూర్యాన్ని చూస్తూనే శ్రీవల్లి ''రావయ్యా.. రా'' అంటూ ఆదరంగా ఆహ్వానించింది. ''నీకోసం కబురు చేద్దామనుకున్నాగానీ ఎవరూ కనుపించలేదు. నా మనసులో మాట తెలిసినట్లుగా వచ్చావ్..'' అంది నవ్వుమొహంతో. ''అవునాండీ'' అంటూ సూర్యం తన చేతిలోని చెక్క ఫలకాన్ని ఆయనకు అందించాడు. చక్కగా పాలిష్ చేసిన సన్నని చెక్కపై తను చెప్పిన కొటేషను రాయబడి ఉంది. చుట్టూ సన్నని గీతా ఉంది. 'చాలా బావుంది' అంటూ అప్పుడే దానిని గోడకి బిగించే పని మొదలు పెట్టేశారు.

''నేననుకున్న దాని కంటే, చాలా బాగా తయారు చేశావ్, చిన్న వాడివైనా మా పెద్దాడి కంటె నువ్వే స్పీడుగా ఉన్నావ్...'' ఉత్సాహంగా ఆయన అన్నమాటలకి సూర్యం కూడా ఆనందంగా తల వూపాడు, పెద్దాడి కంటే అనటంతో తనను రెండోవాడిగా అనుకుంటున్నట్లుగా చెప్పటం సూర్యాన్ని మురిపించింది !

లోపల నుండి వచ్చిన శ్రీవల్లిని చూసి సూర్యం ''అమ్మా నాకోసం కబురు పంపిద్దామనుకున్నట్లు చెప్పారు.. దేనికీ?'' అనడిగాడు.

ఆవిడ నవ్వు మొహంతో ''ఈ రోజు ఇడ్లీ చేసాను, అందుకని ఇద్దరికీ కలిపి పెడదామనీ...'' అంది.

సూర్యం కొంచెం మొహమాటంగా ''నాది ఇంట్లో పూర్తయింది. సార్‌కి పెట్టండి. నేను పక్కనే కూర్చుంటాను...'' అన్నాడు.

ఆవిడ కొంచెం నిష్టురంగా అంది. ''సరి... అలాగే చూస్తూ కూర్చో. ఏది పెట్టినా తినటం, కావాల్సింది అడగటం ఇంట్లో వాళ్ళకే హక్కు

ఉంటుంది కాబట్టి వాళ్ళకే మనమూ స్వతంత్రంగా పనులు పురమాయించగలం అవునా...? నీకీవేళ కొంచెం పని చెబుదామనుకున్నా. వద్దులే. మేమిద్దరం చేసుకుంటాం. అదీ నువ్వు చూస్తూఉండు...!''. సూర్యం వెంటనే అన్నాడు. ''అమ్మా... మిమ్మల్ని అడగటానికి నాకేం మొహమాటం లేదు. ఏదో కొంచెం సంకోచం మాత్రం ఉండిపోయింది! అదిపుడు మీ మాటలతో పూర్తిగా ఎగిరిపోయింది! మీరు ఎన్ని ఇడ్లీలు పెట్టినా తినేస్తాను! మీకోసం మళ్ళీ వండుకోవాల్సి వస్తుందేమో మరి!''

ఉత్సాహంగా ముందు గదిలో ఓ వారగా ఉన్న చిన్న చాపలు తెచ్చి పరిచి కూర్చున్నాడు.

శ్రీవల్లి మొహం వికసించింది. చకచకా రెండు ప్లేట్లలో ఇడ్లీలు, చట్నీ గిన్నె అన్నీ తీసుకు వచ్చేసింది.

ఇష్టంగా తింటున్న సూర్యం వైపు చూస్తూ ఆయన అన్నాడు ''ఏమిటో... ఈ ఆడవాళ్ళకు తాము వండిన దాన్ని ఇష్టంగా తినేవాళ్ళను చూస్తే ఎందుకంత ఆనందంగా ఉంటుందో?''

సూర్యం చిరునవ్వుతో "దాన్నే తల్లి మనసు అంటారు. చాలా మంది తల్లులకు తమ పిల్లలు కడుపునిండా తింటే చాలు, వాళ్ళ ఆకలీ తీరిపోతుంది'' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.

ఆయన అది గమనించి. ''ఎందుకోయ్ కన్నీళ్ళు....?'' ఆశ్చర్యంగా అడిగాడు. సూర్యం ఆనందం నిండిన కంఠంతో బదులు చెప్పాడు ''అమ్మ గారు... నన్నూ తన బిడ్డగా భావించిన నా అదృష్టానికి...''

‘‘అంతేనా... భలేవాడివే...!’’ అంటూ ఆయన భళ్ళున నవ్వి ‘‘నేనింకా ఆవిడ చెప్పిన పనులు చేయాల్సి వచ్చినందుకేమోననుకున్నాను సుమా !’’ అన్నాడు పరిహాసంగా.

సూర్యం కూడా చిన్నగా నవ్వాడు.

*****